క్లుప్తంగా

సొసైటీ చైర్మన్‌గా గోగం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు విశాల పరపతి సహకార సంఘం చైర్మన్‌గా ఎనికేపాడుకు చెందిన గోగం వెంకట బాల కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ త్రి సభ్య కమిటీలో పొలిశెట్టి గోపాలరావు (రామవరప్పాడు), జనపాల శ్యామలరావు (ప్రసాదంపాడు)లు సభ్యులుగా నియమితు లయ్యారు. మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాలు ఈ సొసైటీ కిందకు వస్తాయి.

కమ్యూనిటీహాలు నిర్మాణానికి శంకుస్థాపన



కంకిపాడు: మండలంలోని ఉప్పులూరులో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. హడ్కో నిధులు రూ.70 లక్షలతో దీనిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ ఫోర్‌లైన్‌గా ఉన్న విజయవాడ- మచిలీపట్నం రోడ్డును సిక్స్‌లైన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ఎన్‌హెచ్ అధికారులతో చర్చించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, కొండవీటి శివయ్య, పులి కామేశ్వరరావు, ముప్పా రాజా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంతుష్ట జీవితమే ఆరోగ్యదాయకం



పాయకాపురం(విజయవాడరూరల్): ఉద్యోగి అయినా, ఏ వృత్తి చేసే వారైనా వారి జీవితంలో సంతృప్తి అనే భావన సొంతం చేసుకొని, ఆత్మీయ అనురాగాలతో ఉంటే జీవితం సౌఖ్యవంతంగా సాగుతుందని ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మిక వేత్త బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఆదివారం పైపులరోడ్డు ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్లో కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసిన గాదే అమర్నాథ్ ఆత్మీయ అభినందన సభ జరిగింది. హజరత్తయ్య గుప్తా పాల్గొని వివిధ శ్లోకార్థ సహితంగా తెలిపి అమర్నాథ్ దంపతులను సత్కరించి, వేదాశీర్వచనం అందించారు. కోర్టు సిబ్బంది, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నాయకులు కె.గోపినాథ్‌రెడ్డి, అశోక్ రెడ్డి, వై.సుబ్బారెడ్డి, ఎస్.భాస్కరరావు, సి.హెచ్. వరప్రసాద్, ఎ. వేణుగోపాల్ పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ):యోగా సాధనతో సంపూర్ణ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు యోగ సాధకులు తెలిపారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ భవానీపురం-1 శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకటవ శాఖ అధ్యక్షుడు గుండు జనార్ధనరావు, యోగాచార్యులు కళాధర్ యోగి నేతృత్వంలో విద్యాధరపురంలోని సరస్వతి నిలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. నిత్య జీవితంలో యోగా చేయటం వలన కలిగే ఫలితాల గురించి వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. దాదాపు వంద మందికిపైగా యోగా సాధకులు పాల్గొన్న ఈ పాదయాత్ర పలు వీధులగుండా సాగుతూ తిరిగి సరస్వతి నిలయం వద్దకు చేరుకుంది. అనంతరం అక్కడ నిత్య యోగా సాధకుల ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పరుచూరు లక్ష్మీ ప్రసాద్, వక్కలగడ్డ శ్రీధర్, శిరంశెట్టి వెంకటేశ్వరరావు, జనపాల శ్రీనివాసరావు, గంజి రంగనాయకులు రెడ్డి, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బోనాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంటలో ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి 37వ బోనాల ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బొండా మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యాన పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్, తోట పాండు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణం ఎప్పుడో?



పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన ప్రదేశం



గేటు పడటంతో నిలిచిన వాహనాలు

- పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్‌కై ఎదురు చూపు
- ఫ్లై ఓవర్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని వినతి

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి రోడ్డు మార్గంలో పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా కోరుతున్నారు. ఇప్పటికీ ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రైల్వే గేటు పడితే ప్రయాణాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల నుంచి పాల వ్యాపారులు వందల కొద్ది లీటర్ల పాలు సేకరించి విజయవాడకు నిత్యం తీసుకువెళుతూ ఉంటారు. ఆలస్యం అయితే పాలు విరిగిపోయే ప్రమాదం ఉండటంతో వాహనాలను వేగంగా నడుపుతూ రైల్వే గేటు దాటేందుకు ప్రయత్నిస్తుంటారు.

గేటు అవతల పారిశ్రామిక ప్రాంతం

పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ అవతల వైపు చిన అవుటపల్లి, తెంపల్లి గ్రామాలకు చెందిన పారిశ్రామిక ప్రాంతాలు ఉన్నాయి. వీటిల్లో పదుల కొద్ది పరిశ్రమలు నెలకొల్పారు. మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు కృషి చేస్తున్నారు.

వీరపనేనిగూడెంలో ఏపీఐఐసీ పార్క్

వీరపనేనిగూడెం గ్రామంలో వందలాది ఎకరాల్లో ఏపీఐఐసీ భూములు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పారు. మరిన్ని పరిశ్రమలు ప్రాథమిక దశలో నెలకొల్పుతున్నారు. ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ఇక్కడ భూముల కోసం ఏపీఐఐసీకి దరఖాస్తులు అందజేశారు.

అందరికీ ఇబ్బందే..

ఈ లెవెల్ క్రాసింగ్ దాటుకుని వెళితే తెంపల్లి, శివారు బల్లిపర్రు, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, శివారు గ్రామం మెట్లపల్లి ఉన్నాయి. ఈ గ్రామాల్లో వేలాది మంది జనాభా ఉన్నారు. వందలాది మంది ఉద్యోగులు ఉన్నారు. పారిశ్రామిక వాడల్లో వేలాది మంది పని చేస్తున్నారు. వీరందరికీ లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.



ఫ్లై ఓవర్ నిర్మించి ఆదుకోవాలి

ఫ్లై ఓవర్ నిర్మిస్తామని ఎప్పటినుంచో నాయకులు చెబుతున్నారు. అయితే కార్యాచరణ దాల్చలేదు. రోజూ గన్నవరం వెళ్లేందుకు ఈ లెవెల్ క్రాసింగ్ వద్ద సమయం కోల్పోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా నిర్మించి ఆదుకోవాలి.

– పులపాక రాజారత్నం, బల్లిపర్రు



ఎందరికో మేలు

ఫ్లై ఓవర్ నిర్మిస్తే ప్రజలకు, రైతులకు, ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుంది. పారిశ్రామిక ఉత్పత్తులు మరింత ఊపందుకుంటాయి. మరిన్ని పరిశ్రమలు వస్తాయి. దీంతో యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రయాణాలు సౌకర్యంగా ఉంటాయి.

– మిరప నాగేశ్వరరావు, మండల సీఐటీయూ నాయకుడు

యువతలో అధికమవుతున్న వినికిడి సమస్యలు



వృద్ధులకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువత అధికంగా సెల్ ఫోన్‌లో మాట్లాడటం, ఇయర్ ఫోన్స్ వినియోగించటం వల్ల చిన్న వయస్సులో వినికిడి లోపాన్ని ఎదుర్కొంటున్నారని ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ వైద్య నిపుణులు యార్లగడ్డ సుబ్బారాయుడు, ఈఎన్‌టీ వైద్య నిపుణులు రాయల్ ప్రీతమ్ పేర్కొన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో సీతారామస్వామి దేవస్థానం ట్రస్ట్, ప్రవాసాంధ్రురాలు కోవి శ్లోక నేతృత్వంలో వినికిడి, చెవి సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వయోభారంతో వృద్ధుల్లో కలిగే వినికిడి లోపంతో పాటుగా ఇటీవలి కాలంలో యువతలోనూ ఈ సమస్య అధికమవుతుందని డాక్టర్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది యువత తప్పు వినికిడి అలవాట్ల వల్ల శాశ్వత శ్రవణ నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే చెవి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తే వృద్ధాప్యంలోనూ వినికిడి లోపం రాదని చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటుగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఆడియాలజిస్ట్ శ్రీను నాయక్, రాధిక రాయుడు, ఆస్పత్రి సిబ్బంది, గ్రామ ప్రముఖులు ముసునూరు కాశీవిశ్వేశ్వరరావు, కోవి శశిధర్ పాల్గొన్నారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ, బోడె వెంకటరామ్ తదితరులు

కంకిపాడు: ఫినిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి, తుమ్మలపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంకిపాడులో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన సలహాలు ఇచ్చారు. శుక్లాలు ఉన్న పలువురు రోగులను గుర్తించి త్వరలో వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, బోడె వెంకటరామ్, తుమ్మలపల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి హరికృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌లు అన్నే ధనయ్య, కొండా ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహనకు 2కే రన్



హనుమాన్‌జంక్షన్‌లో 2కే రన్‌లో డాక్టర్లు, వైద్య సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: హెచ్‌పీవీ వైరస్ ద్వారా సంక్రమించే క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శేరిన రన్నపాలెం రోడ్డులోని మెడివ్యాలీ హాస్పటల్స్ నేతృత్వంలో చేపట్టిన 2కే రన్‌కు డాక్టర్లు, వైద్య సిబ్బంది, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హెచ్‌పీవీ వైరస్ ద్వారా కలిగే క్యాన్సర్‌ను నిరోధించటానికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు.

పోటాపోటీగా నర్తించిన చిన్నారులు

- హరిత బెరంపార్క్‌లో నృత్య పోటీలు
- ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకే పోటీలు: కలెక్టర్ లక్ష్మీశ



నృత్య పోటీలో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, చంద్రశేఖర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):జిల్లా యంత్రాంగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో నిర్వహిస్తున్న సంప్రదాయ నృత్య పోటీల్లో భాగంగా ఆదివారం రెండవ కేటగిరికి చెందిన 7–10 ఏళ్ల వయసుగల చిన్నారులు పోటాపోటీగా నర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కళలకు కాణాచిగా ప్రసిద్ధి చెందిన ఉమ్మడి కృష్ణా జిల్లాలో కళా సంపదను మరింత పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భావి తరాలకు కళా సంపదను వారసత్వంగా అందించేందుకు విజయవాడ టాలెంట్ పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా వారిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నామని తెలిపారు. కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్య తీసుకువచ్చేందుకు అవకశం ఉందన్నారు. సుసంపన్న ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ సాకారానికి పర్యావరణ పరిరక్షణ కీలకమని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చెక్ పెట్టి స్వచ్ఛతా మార్గంలో పయనించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా నిలిపేందుకు జిల్లా అధికారం యంత్రాంగం, నగర పాలక సంస్థ, వివిధ భాగస్వామ్య పక్షాల సహాయంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఆదివారం 11–15 ఏళ్ల వయసు కేటగిరిలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ఆదివారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్ల పూడిక తీశారు. మురుగునీరు పారుదలలేని డ్రెయిన్లను గుర్తించి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిచే కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పూడికతీయించారు. గ్రామంలో ప్రధాన డ్రెయిన్, అంతర్గత రహదారుల్లో, కాల్వగట్టు ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని బీఎంపీఎస్ రోడ్డులో డ్రెయిన్‌లో మురుగు తిష్ట వేయడంతో చిన్నపాటి వర్షానికి కూడా మురుగు రహదారిపైకి చేరుకుంటుందన్నారు. పలు ప్రాంతాల్లోని డ్రెయిన్లను పూడిక తీయించినట్లు వివరించారు.

నేడు ఇళ్లపట్టాల పంపిణీ

కంకిపాడు: పట్టణంలోని రెల్లికాలనీలో నివాసం ఉంటున్న 20 మంది పేదలకు నివేశన స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వీ.భావనారాయణ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ ద్వారా అర్జీలను స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం నందమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇందుపల్లి ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ కార్యనిర్వాహక ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరు, మధిరపాడు, ఇందుపల్లి, వెల్దిపాడు, ఎలుకపాడు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు):ఈ నెల 29వ తేదీ నుంచి జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ తూర్పు నగర నాయకుడు ఎస్.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాణిగారితోటలోని గ్రంథాలయంలో వివిధ రంగాల కార్మికులతో ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను అమ్మేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతుందన్నారు. ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోయిందని, నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, విద్యుత్ చార్జీలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. కానీ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు మాత్రం పెరగకపోవడంతో కొనుగోలు శక్తి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే సీఐటీయూకు కార్మికులు మద్దతు తెలిపి పెద్ద ఎత్తున మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ తూర్పు నగర నాయకులు చంద్రశేఖర్, డి.వరప్రసాద్, కృష్ణ, కోటిరెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని ధర్నా



యనమల కుదురులో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: యనమలకుఎదురు గ్రామం సుగాలీ కాలనీలో డ్రెయినేజీ సమస్యను తాడిగడప మున్సిపాలిటీ పరిష్కరించటం లేదని నిరసన వ్యక్తం చేస్తూ స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో సుగాలీకాలనీ, భగత్ సింగ్‌నగర్, వైఎస్సార్ నగర్, అంబేడ్కర్‌నగర్, బీసీ కాలనీల్లో పలు ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు ఉన్న సీసీ డ్రెయినేజీ వ్యవస్థ గత 2024 సంవత్సరంలో అధిక వర్షాల వలన కూలిపోయిందన్నారు. అప్పటి నుంచి డ్రెయినేజీకి మరమ్మతులు చేయటం కాని, నూతన డ్రెయినేజీ నిర్మాణం కాని చేయలేదని తెలిపారు. ఈ కారణంగా మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వలన తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ వెంటనే డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం, స్థానికులు వి.శ్రీనివాసరవు, ఎన్.భారతి, జె.శివనాయక్, ఎ.బాబూరావు, ఎస్.హరిబాబు, సాయిచరణ్, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న మానవత సభ్యులు

గన్నవరం: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మదుపల్లి బాలకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. 2024- 25 సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో 591 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన దుబ్బాకు దుర్గాయశ్వంత్‌కు రూ.3 వేలు, 589 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన వీరవెంకటనాగేంద్రకు రూ.2 వేలు ప్రోత్సాహక బహుమతులను మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆదివారం అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఎంఈఓ సాంబశివరావు, సంస్థ కో చైర్మన్ కేఎస్. జగదీశ్వరరావు, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, ఉపాధ్యక్షులు పువ్వుల ఆదినారాయణ, కార్యదర్శి వీవీ కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఉడత రామకృష్ణ, హెచ్‌ఎం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

మతకన్యలపై అక్రమ కేసులకు నిరసనగా ర్యాలీ



కానూరులో శాంతి ర్యాలీలో క్రైస్తవులు

పెనమలూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో క్రైస్తవ మతకన్యలను అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా ఆదివారం కానూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్మెల్ మాత పుణ్యక్షేత్రం విచారణ గురువు సలివేంద్రశౌరి మాట్లాడుతూ సమాజంలో అన్ని మతాలు సమానమే అన్నారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని కోరారు. రాజ్యాంగంలో ఉన్న హక్కుల కోసం క్రైస్తవులం పోరాటం చేస్తామన్నారు. రెవరెండ్ సిస్టర్ గీతి మాట్లాడుతూ ఇద్దరు మతకన్యలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. అన్ని మతాలు సమానమేనని అన్నారు. హక్కులు హరించే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. ఈ సందర్భంగా కార్మెల్ మాత పుణ్యక్షేత్రం నుంచి కామయ్యతోపు అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు దేవదానం, రత్నరాజు, నంది అవార్డు గ్రహీత మధురకవి బండి స్టాన్లీ, క్రైస్తవ పెద్దలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● చేతిపంపు ఇలా.. అవసరం తీరేదెలా?



అధికారుల అలసత్వం.. కాంట్రాక్టరు నిర్లక్ష్యం.. వెరసి ప్రజల తాగునీటి ఇబ్బందులకు కారణమైంది. కంకిపాడు పట్టణంలోని ఎస్సీ కాలనీలో రూ.22 లక్షల అంచనా వ్యయంతో సిమెంటు రోడ్లు నిర్మించారు. రోడ్డు మార్జిన్‌లను రబ్బిష్‌తో మెరక చేశారు. రోడ్డు మార్జిన్‌లో స్థానిక ప్రజల నీటి అవసరాలను తీరుస్తున్న చేతి పంపు కూడా ఉంది. ఈ పంపు చుట్టూ పూర్తిగా మెరక వేసేశారు. కనీసం ఒంగి గ్లాసు నీరు పట్టుకునే ఆస్కారం కూడా లేదు. వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన చేతి పంపు అలంకారప్రాయంగా మారింది. ప్రజల అవసరాలు గుర్తించకుండా ఇలా.. వ్యవహరిస్తే ఎలా సారూ అంటున్నారు.

– కంకిపాడు

ఘనంగా హర్‌ఘర్ తిరంగా వేడుకలు



మొదటి బహుమతి పొందిన ముగ్గు

పెనమలూరు: కానూరు సిద్ధార్థ హయ్యర్ ఎడ్యుకేషన్ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం హర్ ఘర్ తిరంగా– 2025 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రంగోలి పోటీలు జరిపారు. ఇంజినీరింగ్ విద్యార్థినులు దేశభక్తిని ప్రదర్శిస్తూ జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలిపే విధంగా రకరకాల ముగ్గులు వేశారు. గెలుపొందిన విద్యార్థినులకు వైస్ ఛాన్సలర్ డాక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.రవిచంద్ బహుమతులు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సుష్మా, కె.మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

17న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది ఆదివారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ వేదికలో పాల్గొనేవారు స్వయంగా వేదిక దగ్గర, లేదా 99660 96999, 96181 93027 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.